నేడు ఉపకరణాల పంపిణీకి దివ్యాంగుల ఎంపిక

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఉపకరణాల పంపిణీకి దివ్యాంగులను ఎంపిక చేయనున్నట్టు ఎంపీడీవో విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమునిపట్నం నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగులకు అవసరమైన వివిధ ఉపకరణములు పంపిణీ చేయుటకు జిల్లా డిజేబుల్ వెల్ఫేర్, ఐడిబిఐ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించ బడుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి భీమునిపట్నం నియోజక వర్గంలో గల వివిధ మండలాల దివ్యాంగులు హాజరు కావాలని, ఈ కార్యక్రమం ఉదయం 9.00 గంటలకు పద్మనాభం మండలం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు నిర్వహించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి శుక్రవారం జీవీఎంసీలో పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ప్రజల నుండి ఫిర్యాదులు/వినతులు వస్తున్నాయని కమిషనరు తెలిపారు. కావున పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులను, వినతులను ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీకరిస్తారని కమీషనరు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలియజేశారు.

కాలువ సమస్య పరిష్కరిస్తాం

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో రెడ్డికి పేటలో కాలువ సమస్యపై బుధవారం విశాలాంధ్రలో ప్రచురించిన వార్తకు స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు స్పందించారు. సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో విచారణ జరిపి పూర్తిగా వివరణ తెలుసుకుని సర్వే నెంబరు 19లో ఉన్న మురికి కాలువను పరిశీలించారు. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ప్రజా ఉపయోగమైంది కావున పూర్వకాలంలో ఎలా అయితే కాలువ గుండా నీరు ప్రవహించేదో అదే విధంగా మరలా మురికి కాలువ నీరు పోయేటట్లు ఏర్పాట్లు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం సర్వేనెంబర్ 19లో పూర్తిగా సర్వే చేయించి అక్కడ ఎటువంటి గొడవలు జరగకుండా ఆ స్థలం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే సర్వే చేయించమని స్థానిక సర్వేయర్‌కు, వీఆర్వోకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. తమ సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు తహశీల్దార్ ఆనందరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, విఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఫుట్ బాల్ ఇంటర్ యూనివర్శిటి జట్టు ఎంపిక

అభినందించిన స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎస్.విజయమోహన్

విశాలాంధ్ర -విశాఖపట్నం: ఆంధ్రాయూనివర్శిటీ ఫుట్ బాల్ పురుషుల జట్టు ఎంపిక జరిగింది. ఈసందర్భంగా ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎస్. విజయమోహన్ ఏయూ ఫుట్ బాల్ జట్టు క్రీడాకారులను అభినందించారు. ఇంటర్ యూనివర్శిటీ సౌత్ జోన్ పోటీలు ఈనెల 21 నుంచి 30 వరకు కాలికట్ యూనివర్శిటిలో జరగనున్నట్లు తెలిపారు.లి జట్టు కోచ్ గా డాక్టర్ లంకపల్లి బుల్లయ్యకళాశాల పిడి డాక్టర్ లక్ష్మణ రెడ్డి వ్యవహరిస్తారన్నారు. ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి మాట్లాడుతూ ఫుట్ బాల్ పురుషుల జట్టు ప్రతిభ సాధించి వర్శిటికి పేరుతీసుకురావాలన్నారు.

మిజోరామ్ రాష్ట్రం కోసం గీతం సరికొత్త టెక్నాలజి

రైతులు ఉపయోగించేలా హైబ్రీడ్ సోలార్ డిహైడ్రేటర్

విశాలాంధ్ర - మధురవాడ: ఏడాది పొడవున అధిక తేమ వాతావరణంతో ఉండే ఈశాన్య రాష్ట్రాలలో ఉద్యాన వన పంటలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచ డానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజి ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. హైబ్రీడ్ సోలార్ డిహైడ్రేటర్ పేరిట రూపొందించిన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మిజోరామ్ రాష్ట్ర ఉద్యానవన శాఖా మంత్రి ప్రొఫెసర్ లాల్‌నిలావ్‌మాకు జి-టెక్ కోఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు ఇటీవల జరిగిన కార్యక్రమంలో అందజేశారు. జి-టెక్‌కు చెందిన నిపుణులు డాక్టర్ కె.వి.వి.ఎన్.ఆర్.చంద్ర మౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జి-టెక్ అధికారి సోంబట్ శాస్త్రీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారు. తక్కువ వ్యయంతో అయ్యే ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఉష్ణోగ్రతలను నియంత్రించే సెన్సార్‌లు, పగటి పూట సూర్య రశ్మిని గ్రహించి సౌరశక్తిని నిల్వచేసి రాత్రి సమయంలోను తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షించే పరిజ్ఞానం ఉపయోగించినట్లు వారు తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఆహార ఉత్పత్తుల రంగు, రుచి, వాసనలలో ఏవిధమైన మార్పులు ఉండవని పేర్కొన్నారు. దీనితో ఈశాన్య రాష్ట్రాలలో అధికంగా పండే వివిధ రకాల చిరు ధాన్యాలు, పసుపు, జీడిపప్పు, గోధుమలు, సన్‌ఫ్లవర్ గింజలు తదితరాలను తేమ లేకుండా పొడి బారేటట్లు చేసి దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చునని వారు వెల్లడించారు. వీటితో పాటు రైతులు పండించే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఔషధ మూలికలను సహితం ఎక్కువ కాలం ఉపయోగించుకోనేలా చేయవచ్చునని తెలిపారు. గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం దిగుబడి అయిన పంటలలో తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందని మిజోరామ్ రాష్ట్ర ఉద్యానవన శాఖా మంత్రి ప్రొఫెసర్ లాల్‌నిలావ్‌మా గీతం నిపుణుల మేధో సహకారాన్ని అభినందించారు. కాగా మిజోరామ్ గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు తనను కలిసిన గీతం నిపుణుల బృందం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం విశేషాలను అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయాలోని పరిశోధన ఫలితాలు క్షేత్ర స్థాయిలో ఈ విధంగా ఉపయోగపడటం అభినందనీయమన్నారు.

కమిషను ఏర్పాటుకు చట్ట బద్దత లేదు

వర్గీకరణ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వర్గీకరణకు అనుమతిస్తూ ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి విరుద్ధమని, ఆ తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఏక సభ్య కమీషన్‌కు కూడా చట్ట బద్ధతలేదని, జాతీయ ఎస్సీ కమిషన్ అనుమతి లేని కమిషన్ల సిఫార్సులు చెల్ల నేరవని విదసం ఐక్య వేదిక ఆధ్వర్యంలో దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ ఏక సభ్య కమిషన్ బుధవారం విశాఖ కలెక్టరు కార్యాలయంలో దళిత సంఘాల నుండి వినతి పత్రాలు స్వీకరించింది. ఈ సందర్భగా విదసం భాగస్వామ్య సంఘాలు భీమ్ సేన వార్, ఏఐడీఆర్ఎఫ్, దళిత సేన, తదితర సంఘాలు వర్గీకరణ తీర్పులోని అంశాలపై రాజ్యాంగ పరమైన అభ్యంతరాలను కమీషన్‌కు వ్రాత పూర్వకంగా సమర్పించారు. అనంతరం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో సముదాయములు, మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందని ఆర్టికల్ 341, 342 స్పష్టం చేస్తున్నాయన్నారు. ఈ ఆర్టికల్ సవరణ చేయాలంటే పార్లమెంటులో మూడొంతులు మెజారిటీ ఉండాలని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్లు సామాజిక, విద్యా వెనుకబాటు ద్వారా మాత్రమే వచ్చాయని ఆర్థిక వెనుకబాటు ద్వారా రాలేదని తెలిపారు. రిజర్వేషన్లకు క్రిమిలేయర్ వర్తింపచేయాలన్న తీర్పు అర్ధరహితం అని డాక్టర్ బూసి వెంకటరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. భీమ్ సేన చిన్నారావు మాట్లాడుతూ కులగణన చేసి ఆ మేరకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు సంబంధించి పాలసీలలో ప్రధాన మార్పులు చేయాలంటే ఆర్టికల్ 338 క్లోజ్ 9 ప్రకారం ఎస్సీ కమిషన్ అనుమతి తీసుకోవాలని దళిత సేన గొల మాల అప్పారావు అన్నారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోదాదాసి సుధాకర్, బంటు కృష్ణా రావు, రవి సంతోష్, గుడాల ఈశ్వరరావు, మాటూరు శ్రీనివాసరావు వసంత రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్ సతీష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 46వ వార్డు పరిధి మధుసూదన్ నగర్ 1, 2 ఏరియాలోను అలానే వార్డులో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ జి.రాముతో కలిసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ వార్డులో పర్యటించి పరిశీలించారు. వార్డులో ఇంకా మిగతా జరగని అభివృద్ధి పనులను, చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వార్డులో శానిటేషన్ పనులు ఏ విదంగా జరుగతున్నవి పరిశీలించారు. ఈ మేరకు వార్డులో ప్రజల నుంచి వార్డు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ సప్లై డీఈ, వార్డు సెక్షన్ ఏఈ ఉమహేశ్వరరావు, వర్క్ ఇన్స్పెక్టర్ నరేష్, సచివాలయ సిబ్బంది కే.చిన్న, కే.ఈశ్వరరావు, కే.లావణ్య, రామారావు, విజయలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాన్సాస్ భూములకు పట్టాలు ఇవ్వండి

బోని రెవెన్యూ సదస్సులో గ్రామ రైతులు ఆందోళన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బోనిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుండి పలు అర్జీలను స్వీకరించారు. మాన్సాస్ భూముల్లో వ్యవసాయ ఆధార రైతులు ఆర్డీఓకి వినతిపత్రం సమర్పించారు. అందులో భాగంగా రైతులు బోని గ్రామంలో ఉన్న వ్యవసాయాధార భూములు 100 సంవత్సరాల నుండి రైతుల అనుభవంలో ఉన్నాయని నాటి నుండి నేటి వరకు మా భూములలో పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నామని, ప్రభుత్వం ఎన్నడూ శిస్తు వగైరాలు వసూలు చేయలేదని అన్నారు. ప్రస్తుతం మన్సాస్ ట్రస్ట్ అధికారులు రైతులు పండించే భూములకు సిస్తులు చెల్లించాలని అనధికార ప్రకటనలు చేస్తున్నారని అందువల్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామంలో రైతులు సాగు చేసుకున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయమే జీవనాధారం కావున పత్రాలు ఇచ్చినట్లయితే అత్యవసర సమయంలో పొందే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా రైతులు వినతి పత్రంలో తెలిపారు. అలాగే మాన్సాస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌విడివి ప్రసాద్ మన్సాస్ భూములకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీవో సంగీత్ మాధుర్‌కి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, బోని మాజీ సర్పంచ్ వరప్రసాద్, బోనిఅప్పలనాయుడు, సన్యాసినాయుడు, వీఆర్ఓ అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ ప్రాతినిధ్యంపై సమీక్ష

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ సమాచారం పూర్తి స్థాయిలో అధికారుల వద్ద ఉండాలని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా (రిటైర్డ్) విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్ కులముల వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘ నాయకుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో కలసి షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఉన్న కులాల వారీగా గణాంకాలు వివరించారు. విద్యాశాఖ, జిల్లా పరిషత్, డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీస్, వైద్య ఆరోగ్యశాఖ, డిఆర్డిఏ, ఏపీ ఈపీడీసీఎల్, ఆర్టీసీ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై సంబంధిత వివరాలను ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలోని కోరాడ గ్రామంలో బుధవారం సెర్ప్, వెలుగు, ఆర్ వై ఎస్ ఎస్ సంస్థలు సంయుక్తంగా లింగ ఆధారిత హింసను పరిష్కరించేందుకు జాతీయ కార్యక్రమ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా బాలల వేధింపులు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు మరియు పిల్లలకు నిరంతర విద్య యొక్క ప్రాముఖ్యత వంటి క్లిష్టమైన అంశాలపై వివరించారు. టీమ్ జెండర్ కమిటీలను ఏర్పాటు చేసేటప్పుడు నాయకత్వానికి సమర్థవంతరాలైన మహిళను అధ్యక్షురాలుగా నియమించుకోవాలని వెలుగు మహిళలకు సూచించారు. చట్టపరమైన రక్షణల గురించి అవగాహన కల్పించేందుకు నిర్భయ చట్టంలోని నియమాలు, నిబంధనలను మహిళలకు వివరించారు.కార్యక్రమంలో భాగంగా సెర్ప్, వెలుగు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థల ప్రతినిధులు, స్థానిక కోరాడ గ్రామ పాఠశాల విద్యార్థులు పాల్గొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మండలం పద్మనాభం ఎంఎంటియల్ గణేష్, సిహెచ్ఆర్ఎఫ్ జెండర్ ఎస్ఎఫ్ఏ చక్రవర్తి, నేచురల్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ప్రతినిధి దేవిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వెంకటాద్రి క్షేత్రంలో తిరుప్పావై పారాయణం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి వెంకటాద్రిపై మూడో రోజు ధనుర్మాస ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం 4 -30 గంటలకు స్వామివారిని మేల్కొల్పి, హారతి, సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థ గోష్ఠి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు తెలియజేశారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం 4 - 30 నుండి సేవా కార్యక్రమాలు ఉంటాయని, రోజూ కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత వాహన సదుపాయం ఉంటుందని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో నీలిమ వెల్లడించారు.

ప్లాస్టిక్ వాడి అనారోగ్యానికి గురి కావద్దు : డీఈఓ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఒక్కసారి వాడి వదిలేసిన ప్లాస్టిక్ వాడి అనారోగ్యానికి గురి కావద్దు అని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ కోరారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాలు అనుసరించి బుధవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీలోని కెడిపిఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల మీద గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ప్రభలుతున్నాయన్నారు. ఎస్ఆర్‌యు జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస రాజమణి మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి ఒక్కసారి వాడి వదిలేసే 16 రకాల ప్లాస్టిక్‌పై పూర్తి ఆంక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ వాడి వదిలేసే ప్లాస్టిక్ కాల్చడం వల్ల అనేక రకాల విష తుల్య రసాయనాల కాలుష్యం వల్ల జీవ వైవిధ్యానికి, భవిష్యత్తు తరాలకు కలిగే నష్టాలు వర్ణణాతీతం అని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుమతీ బాయి, తెలుగు ఉపాధ్యాయుని సత్యవతి తదితరులు మాట్లాడారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - భీమిలి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.23 లక్షల చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. భీమిలి ప్రాంతానికి చెందిన దల్లి పాపునాయుడు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. అతని భార్య దల్లి లక్ష్మి (55) కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. వైద్యానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చవుతుండడంతో పాపు నాయుడు ఎమ్మెల్యే గంటా కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.3.23 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందించారు. తన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు పాపునాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు.

పుట్టుకతో వచ్చే నేత్ర వ్యాధులపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపే పుట్టుకతో వచ్చే వివిధ నేత్ర వ్యాధులు వాటి నియంత్రణకు చేపడుతున్న చర్యలపై బుధవారం నగరంలోని డాక్టర్ రెడ్డం సూర్యప్రసాదరావు ప్రభుత్వ రీజినల్ ఐ ఆసుపత్రి వైద్యులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారధ్యాన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గొండు సీతారాం పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, వైద్యులు వాణిశ్రీ, జి.ప్రేమ లత, పి.ఎం.ఒ. ఉమాశ్రీనివాస్‌లు హాజరవగా పుట్టుకతో వచ్చే శుక్లాల వ్యాధులతో గత రెండేళ్ల నుండి ఆసుపత్రికి వైద్యానికొచ్చే పిల్లల సంఖ్య ఎంత, ఈ రోగ నిర్ధారణకు కావాల్సిన ప్రత్యేక ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయా, గత మూడేళ్ళ నుండి ఎంత మంది పిల్లలకు శస్త్ర చికిత్సలు చేశారు, అనంతరం పిల్లల రెగ్యులర్ ఫాలోఅప్‌లపై వివరాలను అడిగారు. రికార్డులను సీతారాం పరిశీలించారు. పిల్లలకు ప్రత్యేక ఓ.పి. కేంద్రం అవసరమయ్యే శస్త్ర చికిత్సలకు ప్రత్యేక బెడ్లు, వార్డులును ఏర్పాటు చేశారా, అలాగే విస్తృత వ్యాప్తిలో ఉన్న రెటినో బ్లాస్టోమా కంటి క్యాన్సర్‌కు ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయా, దీనిలో భాగంగా కీమో థెరపీ, రేడియో థెరపీ, లేజర్ థెరపీ వంటి వైద్య ప్రక్రియలు అందిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల కన్నీటి వాహిక అవరోధంగా భావించే టియర్ డక్ట్ వ్యాధిగ్రస్తులైన ఎంతమంది పిల్లలకు శస్త్ర చికిత్సలు చేశారు, వారి వివరాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ పిల్లలకు ప్రత్యేక ఓ.పి.కేంద్రం ఏర్పాటు,శస్త్ర చికిత్సల తరువాత బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఐదు ప్రత్యేక బెడ్లు ఏర్పాటుతో పాటు రోగుల రద్దీ అధికంగా ఉండే సమయాల్లో పిల్లల వైద్యం కోసం నేత్ర వైద్యులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం ఆదేశాలతో నెల రోజుల్లోగా ప్రత్యేక ఓ.పి.విభాగం, పిల్లల కోసం ప్రత్యేకంగా 5 బెడ్లుతో వార్డ్ ను ఏర్పాటు చేసి వైద్య నిపుణుడ్ని, సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు రమణ కుమారి, శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మీ, ఐ.సి.పి.యు ప్రతినిధులు ఆనంద్, శకుంతల, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి : 2
గురువారం 19, డిసెంబర్, 2024

ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సుప్రీం కోర్టు 2004 సంవత్సరంలో ఎస్సీలను ఎబిసిడిలుగా రాష్ట్ర పరిధిలో విభజించడం రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చిందని, ఇప్పుడు అదే న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీలను రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని తీర్పు ఇచ్చిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డా. సీఎం మంగరాజు తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వన్ మేన్ కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది రాజకీయ కుట్రగా భావిస్తున్నా మన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మాదిగల సభలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని మాదిగలకు న్యాయం చేస్తానని, ఎస్సీ వర్గీకరణ చేయిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీ కులంలో వున్న 15% రిజిస్ట్రేషన్‌ను 25% పెంచాలని, ఎస్టీ 7% రిజర్వేషన్‌ను 10% పెంచాలన్నారు. ఎస్సీలో మమ్ములను ఏ గ్రూప్‌లలో పెట్టాలని కోరుతున్నామన్నారు. క్రిమిలేయర్‌ని అమలు పరచడానికి మేము వ్యతిరేకం అన్నారు.

వావ్ స్కిన్ సైన్స్‌తో మీషో భాగస్వామ్యం

విశాలాంధ్ర/విశాఖపట్నం: వావ్ స్కిన్ సైన్స్, మీషోతో తన వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారతదేశపు టైర్ 2+ మార్కెట్‌లలో తన ఉనికిని విస్తరిస్తోందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత సంవత్సరంలో, మీషోతో వావ్ స్కిన్ సైన్స్ భాగస్వామ్యం టైర్ 2+ ప్రాంతాల నుండి 1 మిలియన్ కొత్త కస్టమర్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో దాని విశ్వసనీయ సహజ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను హైలైట్ చేస్తుందన్నారు. తదుపరి 12 నెలల్లో, వావ్ స్కిన్ సైన్స్ మీషోపై వార్షిక రికరింగ్ రెవెన్యూ (ఎఆర్అర్)లో 5 ఏక్స్ వృద్ధిని లక్ష్యంగా చేసుకుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా, పెర్ఫ్యూమ్‌లు, ఫేస్‌వాష్, సీరమ్‌లు, క్రీములు, సన్‌స్క్రీన్‌లు, షాంపూలు, హెయిర్ ఆయిల్‌లు, అలోవెరా జెల్, హెల్త్ డ్రింక్స్ వంటి వర్గాలలో బలమైన డిమాండ్ కారణంగా వావ్ స్కిన్ సైన్స్ టైర్ 2%+% మార్కెట్‌ల నుండి ఆర్డర్‌లలో 10 ఎక్స్ వృద్ధిని సాధించిందన్నారు. నాణ్యత, ప్రభావానికి బ్రాండ్ నిబద్ధత చిన్న పట్టణాల్లోని వినియోగదారులతో ప్రతిధ్వనించింది. అందం, సంరక్షణ స్థలంలో వావ్‌ను ప్రాధాన్య ఎంపికగా ఉంచిందన్నారు.

మండలంలో జెసి సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బుధవారం విశాఖజిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సుడిగాలి పర్యటన చేశారు అందులో భాగంగా ముందుగా తర్లువాడ చుక్క కొండ పరిశీలన, అనంతరం జగన్నాధపురం పరిసర కొండ ప్రాంతాలను పరిశీలన చేశారు. పూర్తిస్థాయి నివేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు జేసి తోపాటు మండల తాసిల్దార్ పేర్ల శ్యామ్ ప్రసాద్ ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలలో పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ- విశాఖపట్నం: బాదం లాంటి పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్కిన్ ఎక్స్‌పర్ట్, కాస్మోటాలజిస్ట్ డాక్టర్ గీతికా మిట్టల్ సూచించారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ కార్యక్రమములో మాట్లాడుతూ కాలిఫోర్నియా బాదం పప్పులు మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్ మరియు ఫాస్ఫరస్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో కూడిన పోషకాహార పవర్‌హౌస్ గా నిలుస్తాయన్నారు. కేక్‌ల నుండి కుకీలు వరకూ బాదం, డ్రై ఫ్రూట్స్‌లో అధికంగా వాడుతారని, ఆల్మండ్ రుచిని పెంచడమే కాకుండా పండుగ సృష్టికి కొంత పోషక విలువలను అందిస్తాయన్నారు. ప్రముఖ సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురించబడిన 200 కంటే ఎక్కువ అధ్యయనాలలో, ప్రతిరోజూ కొన్ని కాలిఫోర్నియా బాదంపప్పులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరను నిర్వహించడంలో సహాయపడుతుందన్నారు. ఇటీవల ప్రచురించబడిన ఐసీఎంఆర్ ఎన్ ఐ ఎన్ ఆహార మార్గదర్శకాలు మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగలిగే పోషకమైన గింజలలో బాదంను ఒకటిగా గుర్తించాయని చెప్పారు.

డామ్ క్యాపిటల్ అడ్వైజర్స్ పబ్లిక్ ఆఫర్ ప్రారంభం

విశాలాంధ్ర- విశాఖపట్నం: డామ్ క్యాపిటల్ అడ్వైజర్స్ లిమిటెడ్ గురువారం నాడు తన ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ("ఆఫర్")ని ప్రారంభించాలని ప్రతిపాదించింది. బిడ్/ ఆఫర్ ముగింపు తేదీ సోమవారం కాగా యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ అనేది బిడ్/ఆఫర్ ప్రారంభ తేదీకి ముందు బుధవారం నిర్ణయించబడింది. ఆఫర్ యొక్క ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 269/- నుండి ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 283/-గా నిర్ణయించబడింది. కనిష్టంగా 53 ఈక్విటీ షేర్ల కోసం మరియు ఆ తర్వాత 53 ఈక్విటీ షేర్ల గుణిజాలలో వేలం వేయవచ్చు. కంపెనీ యొక్క ఒక్కొక్కటి రూ.2 ముఖ విలువ కలిగిన 29,690,900 ఈక్విటీ షేర్లు ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌గా వున్నాయి. రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ద్వారా అందించే ఈక్విటీ షేర్లు బీఎస్ఈ లిమిటెడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో జాబితా చేయబడాలని ప్రతిపాదించబడ్డాయి.

సెబీ వద్ద జీఎస్జీ ఎలక్ట్రానిక్స్ డిఆర్‌హెచ్‌పీ దాఖలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: ల్యాప్‌టాప్‌లు మరియు డెస్క్‌టాప్‌ల పునరుద్ధరణ ఐసీటీ పరికరాల జీఎస్జీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)తో దాని డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి") దాఖలు చేసింది. ఐపిఓలో రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌ల తాజా ఇష్యూ రూ. 825 కోట్ల వరకు ఉంటుంది. ఒక్కొక్కటి రూ.2 ముఖ విలువ కలిగిన 9,700,000 ఈక్విటీ షేర్‌ల వరకు అమ్మకానికి సంబంధించిన ఆఫర్‌ను కలిగి ఉంటుంది. ఆఫర్ ఫర్ సేల్‌లో శరద్ ఖండేల్వాల్ ద్వారా 35,000 వరకు ఈక్విటీ షేర్లు, విధి శరద్ ఖండేల్వాల్ ద్వారా 35,000 వరకు ఈక్విటీ షేర్లు మరియు అమియబుల్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 9,630,000 వరకు ఈక్విటీ షేర్లు ఉన్నాయి. జీయస్జీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ "ఎలక్ట్రానిక్స్ బజార్" బ్రాండ్ క్రింద పనిచేస్తుంది.

నాన్ డయేరియా కేసుల్లో డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ

విశాలాంధ్ర - విశాఖపట్నం: నాన్ డయేరియా కేసుల్లో డీహైడ్రేషన్ పై అశ్రద్ధ వహిస్తున్నారని కెన్‌వ్యూ ఇండియా 'ది హైడ్రేషన్ గ్యాప్ ఫర్ నాన్ డయేరియా ఇల్నెసెస్' నివేదికలో వెల్లడైంది. నాన్ డయేరియా కేసుల్లో జ్వరాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, వైరల్ వ్యాధులు, వేడి వల్ల కలిగే అలసట, బలహీనత తదితర ఉన్నాయి. నాన్ డయేరియా కేసుల్లో ఫ్లూయిడ్స్, ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ (ఎఫ్ఈఈ) పాత్రపై ఈ తాజా నివేదికను విడుదల చేశారు. డయేరియా కారణంగా కలిగే డీహైడ్రేషన్ చికిత్సకు మార్గదర్శకాలు ఉన్నాయి. నాన్ డయేరియా సమయంలో కలిగే డీహైడ్రేషన్ నిర్వహణకు ఫ్లూయిడ్స్, ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ సమతుల్యం పునరుద్ధరించడం చాలా అవసరం. శాస్త్రీయంగా రూపొందించిన ద్రావణాలు ఉపయోగించడం మంచిదే. అయితే, భారత్‌లో ఈ ఎఫ్ఈఈ వినియోగంపై సరైన అవగాహన లేదు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత - చట్టాల అమలులో మరింత పారదర్శకత అవసరం

-ధరణి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హరి వెంకట్

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ధరణి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హరి వెంకట్ పేర్కొన్నారు. లిఆంధ్రా యూనివర్సిటీ లోని సోషల్ వర్క్ విభాగం లో బుధవారం ప్రత్యేక ప్రసంగం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి వెంకట్ మాట్లాడుతూ చట్టాలు అమలులోమరింత పారదర్శకత అవసరం అన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు బోధించడం ఎంతో అవసరం అన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో మరింత మెలుకువగా ఉండాలన్నారు. బాల నేరస్థులు, కార్మికులు లేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలన్నారు. సమాజ ప్రగతిలో సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంశించారు. సోషల్ వర్క్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్. హరనాథ్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్ కు బాటలు వేసే బాధ్యత అందరిపైన ఉందన్నారు. సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు విభిన్న రంగాల్లో నైపుణ్యత సాధించాలన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు డాక్టర్ కోమల్ సలోమి,

అబ్రహం, ఆశాకిరణ్, పుష్పలత, శ్యామ్, వేసవిల, శిరీష, అమిత, లక్ష్మణరావు, సూరిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ

మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

శ్రేణులకు పిలుపునిచ్చారు.

బుధవారం ఉదయం రాంపురంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ డిసెంబర్ 21న జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా నిర్వహించడానికి పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిందని ఈ మేరకు అన్ని గ్రామాలు, వార్డుల్లో కేక్ కటింగ్‌లు, రక్త, వైద్య శిబిరాలు పేదలకు దుస్తులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బయలు పూడి భగవాన్ జయరాం, పైలా శ్రీనివాసరావు, బోకం రామనాయుడు, రాపర్తి మాధవరావు, సిరికి దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై విశ్రాంత వన్‌మాన్ కమిషన్‌కు వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణపై విశ్రాంత వన్ మ్యాన్ కమీషన్‌పై విశాఖ జిల్లాకు విచ్చేసిన రాజీవ్ రంజన్ మిశ్రాకు విశాఖ జిల్లా నాయకులు కలిసి మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో యస్.సి. 59 కులాలలో సీరియల్ నెంబరు:9లో పొందుపరిచిన బేడ (బుడ్గ) జంగం కులాన్ని 17-07-2008లో ఆంధ్రప్రదేశ్లో బోగస్ సర్టిఫికేట్ పేరుతో ఆంధ్రప్రదేశ్లో ఎస్సీలుగా ఉన్న బేడ (బుడ్గ) జంగాలను 144 జీఓ వల్ల సర్టిఫికేట్లను రద్దు చేస్తూ నిజమైన బేడ (బుడ్గ) జంగం వారికి కమిషన్ వేసి దర్యాప్తు చేసి న్యాయం చేస్తానని చెప్పి చేయలేదన్నారు. 2014లో తర్వాత బి.బి.జె హక్కుల పోరాట సమితి అనేక ఉద్యమాలు చేయగా మమ్మల్ని గుర్తించి బేడ (బుడ్గ) జంగం కులంపై జే.సి శర్మ కమిషన్ ను వేయడం, జే.సి శర్మ కమిషన్ ఉమ్మడి 13 జిల్లాలో ఉన్న బేడ (బుడ్గ) జంగం కులంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి 25-09-2023 తేదిన అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం,

ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వ పథకాలు క్యాస్ట్ సర్టిఫికేట్ అనుసంధానంతో ప్రవేశపెట్టాలని వినతి పత్రంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు కటుమూరి తాతారావు, కటుమూరి బాబూరావు, మోతీ గౌరిశ్వరరావు, దుడ్డు కొండయ్య, పస్తం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల్లో సమాంతర వ్యవస్థల పాత్ర, ప్రాముఖ్యత" అనే అంశంపై రెండు రోజుల నేషనల్ సెమినార్ ను నిర్వహించనున్నారు. ఈ సెమినార్ కు సంబంధించిన బ్రోచర్ ను ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణ రావు నేడు ఆయన కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెల 10 , 11 తేదీలలో ఈ సెమినార్ ను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు,రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు ,అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర కుమార్ ,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, సదస్సు సహసంచాలకులు డాక్టర్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

29న తూర్పు కాపు ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పు కాపు సామాజిక వర్గం సారథ్యంలో ఈ నెల 29 న ఎచ్చెర్ల వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆత్మీయ కళియక సమావేశం జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు సామాజిక వర్గం ప్రతినిధులు డోల జగన్ మోహన్ , ఎస్.మోహనరావు సాశపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. రామజోగి నాయుడు, కిళ్ళారి నారాయణరావు, అంకడాల తవిటన్న, డోల బాలకృష్ణ, ఎం. ప్రభాకర్ ,కురిటి దుర్గారావు, ఎస్. సత్యనారాయణ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న తూర్పు కాపు సామాజికవర్గం ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు. హాజరవుతారని తెలిపారు. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యువత మహిళలు రైతు సంఘాల ప్రతినిధులు వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులు అంతా విధిగా హాజరు కావాలని వారు కోరారు. తూర్పు కాపు సామాజిక వర్గం ఐక్యతను చాటి చెప్పడానికి ఈ సదస్సు ఎంతో తోడ్పడుతుంది అని అన్నారు.